ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
గురువారం | 30 అక్టోబరు, 2025 | పేజీలు :08

## సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టిన చైర్మన్

**ప్రజాపక్షం/చొప్పదండి:** మెంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. బుధవారం చొప్పదండి జువ్వాజి వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం కుప్పలు తడవకుండా చైర్మన్ కొత్తూరి మహేష్ సిబ్బందితో కలిసి మార్కెట్‌లోని ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వల్ల రైతులు తమ ధాన్యం కాపాడుకునేందుకు మార్కెట్ ద్వారా అందించే టార్పాలిన్లతో పాటుగా బస్తాలను గోదాములలో నిలువ చేసుకునే సదుపాయాలను వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్‌తో సిబ్బంది పాల్గొన్నారు.



# కరీంనగర్‌లో కుండపోత వర్షం

### అప్రమత్తమైన అధికారులు
### కలెక్టరేట్ లో కంట్రోల్ రూం ఏర్పాటు
### ఎల్ ఎండీ 6 గేట్లు ఓపెన్ చేసిన అధికారులు

**ప్రజాపక్షం/కరీంనగర్:** మోంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో బుధవారం కుండపోతగా వర్షం కురిసింది. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమైన వర్షం ఎడతెరపి లేకుండా కురిసింది. జిల్లాలోని హుజురాబాద్, సైదాపూర్, శంకరపట్నం, చిగురుమామిడి, గన్నేరువరం ఇల్లందకుంటతో పాటు జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురవగా జిల్లాలోని మిగతా మండలాల్లో మోస్తారుగా కురిసింది. జిల్లా కేంద్రంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలో వరికోతలు పూర్తయి కల్లాల్లో ఉన్న ధాన్యం వర్షానికి నీటిపాలయిన పరిస్థితి ఉంది. కోతకు వచ్చిన వరి పంట నేలకొరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 69.5 మి.మీ ల వర్షాపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు.

> **నేడు విద్యాసంస్థలకు సెలవు**
>
> **ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాల నేపధ్యంలో గురువారం అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యాసంస్థలకు ఆదేశాలు జారీ చేశారు.

**కలెక్టరేట్ లో కంట్రోల్ రూం ఏర్పాటు..**

మోంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారుల అప్రమత్తమయ్యారు. కలెక్టరేట్ లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సహాయం కోసం ప్రజలు 0878 2997247 టోల్ ఫ్రీ నెంబర్ కాల్ చేయాలని తెలిపారు.

**ఎల్ ఎండీ ఆరు గేట్లు ఓపెన్**

తుఫాన్ ప్రభావంతో ఎగువన కురస్తున్న వర్షాలతో లోయర్ మానేర్ డ్యాం లోకి వస్తున్న వరద నేపథ్యంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు డ్యాం ఆరు గేట్లను 2 ఫీట్ల మేర ఓపెన్ చేసి నీటిని దిగువకు వదులుతున్నారు. డ్యాంలోని ఇన్ ఫ్లో 18277 క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో 18277 క్యూసెక్కులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.



### పిహెచ్‌సిలు, సబ్‌సెంటర్ పనులు
# వేగవంతం చేయాలి



### కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** జిల్లాలో ప్రజలకు మెరుగ్గైన వైద్య సదుపాయాలు అందించేందుకు నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,ఉప ఆరోగ్య కేంద్రాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రజలకు స్థానికంగానే వైద్య సేవలు అందేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.ఇప్పటికే కొనసాగుతున్న పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.నిర్మాణ పనుల పురోగతిని రోజువారీగా పర్యవేక్షించాలని,పనుల్లో నాణ్యతకు లోటు లేకుండా ఉండాలని ఆదేశించారు.అలాగే,వరద వలస దెబ్బతిన్న పనుల పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. ప్రతి ప్రాజెక్ట్‌పై పనుల వేగం పెంచాలని సూచించారు. ప్రజల ప్రాణ,ఆస్తి రక్షణ దృష్ట్యా ఈ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.ఇంజనీరింగ్ శాఖల మధ్య సమన్వయం సాధించి అడ్డంకులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ అనిల్, డిఈ పిఆర్ తుకారాం తదితర అధికారులు పాల్గొన్నారు.

### మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి
# ఉచిత చేప పిల్లల విడుదల

### డా. పాల్వాయి హరీష్ బాబు

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్:** మత్స్యకారుల అభివృద్ధి ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా చేపట్టిన ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని బుధవారం సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు ప్రారంభించారు. కాగజ్ నగర్ మండలంలోని కోసిని గ్రామంలో ఉన్న కోసిని డ్యామ్‌లో ఆయన చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ మత్స్య శాఖ ఆధ్వర్యంలో చెరువుళలు డ్యామ్‌లలో చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. కాగజ్ నగర్ నియోజకవర్గం పరిధిలోని 165 చెరువులలో 61.96 లక్షల చేప పిల్లలను రోజుకు ఒక మండలం చొప్పున వారం రోజులలో పూర్తి చేస్తామని అన్నారు. చేపల పెంపకం ద్వారా గ్రామీణులు ఆర్థికంగా బలపడతారని, ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే, కోసిని డ్యామ్‌ను పర్యాటక స్థలంగా అభివృద్ధి చేసేందుకు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్థానిక సమస్యలను ఎంఎల్‌ఏ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఉజ్వల్ కుమార్, జిల్లా ఫిషరీస్ అధికారి సాంబశివ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ సిద్ధక్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, బాబురావు, పట్టణ అధ్యక్షులు ఆర్మీ శివ, అశోక్, శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి తిరుపతి, వెంకటేష్, నరేష్, యలమంచిలి శ్రీనివాస్ రావు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# జమ్మికుంట పట్టణంలో రెచ్చిపోయిన దొంగలు



**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట పట్టణంలో దొంగలు రెచ్చిపోయారు. పట్టణం నడిబొడ్డున ఉన్న రెండు షాపుల్లో చోరీకి పాల్పడ్డారు. పట్టణంలోని గాంధీ చౌరస్తా సమీపంలో ఉన్న ఎస్ఎల్ఎస్ జ్యువెలరీ, పాత సిటీ కేబుల్ లేన్‌లో ఉన్న డిస్కౌంట్ మొబైల్ స్టోర్ షట్టర్ల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. కాగా ఉదయం షట్టర్ తాళాలు పగలగొట్టి ఉన్న విషయాన్ని గమనించిన చుట్టుపక్కన వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు షాప్ యజమానుల సమక్షంలో సిసి పుటేజీ ఆధారంగా విచారిస్తున్నారు. షాప్ షట్టర్లు లేపిన దొంగలు దొంగతనానికి పాల్పడేందుకు ప్రయత్నించగా సిసి పుటేజీ ఆధారంగా ముసుగు వేసుకున్న ఒకే వ్యక్తి దొంగతనానికి పాల్పడ్డట్లు గుర్తించారు. పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రంగంలోకి దించి విచారణ చేపట్టారు. మొబైల్‌షాపులో, జ్యువెల్లరీ షాపులో ఎలాంటి వస్తువులు దొంగలించలేదని నిర్ధారణకు వచ్చారు. షాప్ యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ గౌడ్ మీడియాకు తెలిపారు.

## త్రిశూల ఆకారంలో వింత మిరపకాయ

**ప్రజాపక్షం/గంగాధర:** కొన్ని వింత సంఘటనలు అరుదుగా కనిపిస్తాయి. ఇటీవల కాలంలో పండ్లు, కాయలు వింత ఆకారాల్లో దర్శనిమిస్తూ అందరినీ షాక్‌కు గురిచేస్తున్నాయి. అవి కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. కాలజ్ఞానంలో బ్రహ్మంగారు ముందే ఊహించి వింత సంఘటనలు జరుగుతాయని పేర్కొనట్లుగానే స్పష్టమవుతున్నాయి. తాజాగా ఓ మిరపకాయి త్రిశూల ఆకారంలో దర్శనమిస్తూ వార్తల్లో నిలిచింది. వివరాల్లోకి వెళితే గంగాధర మండలంలోని చెర్లపల్లి(ఆర్) గ్రామానికి చెందిన బూరుగు గంగన్న అనే రైతు సాగుచేసిన మిరపతోటలో బుధవారం మిరపకాయలు తెంపుతుండగా ఓ మిరపకాయ త్రిశూల ఆకారంలో కాసింది. ఈ సంధర్భంగా రైతు గంగన్న మాట్లాడుతూ కార్తీకమాసంలో త్రిశూల ఆకారం మిరపకాయ కాయడంతో శివుని మహిమగా బావిస్తున్నామంటూ ఆనందం వ్యక్తం చేశారు. వింతను చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపించారు.

## రొంపికుంట గ్రామపంచాయతీ కార్యదర్శినీ విధుల నుంచి లగింపు

**ప్రజాపక్షం/రామగిరి:** కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామం బుధవారం రోజున జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఎం. తిరుపతినీ విధుల నుంచి తొలగిస్తూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉత్తర్వులు జారీ చేశారు వారధి సొసైటీ ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా కమాన్ పూర్ మండలం రోంపికుంట గ్రామానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న ఎం.తిరుపతి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణల పై విచారణ జరిపిన కలెక్టర్, అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో వెంటనే సంబంధిత ఔట్ సోర్సింగ్ ఉద్యోగం నుంచి తొలగించారు. కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తుందని, ఈ పథకం అమలులో ఎటువంటి అక్రమాలకు పాల్పడినా అత్యంత కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

## 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి

**ప్రజాపక్షం/వేములవాడ:** కేంద్ర హోం శాఖ మంత్రిగా సేవలు అందించి ఉక్కుమనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 1875లో జన్మించారని ఆయన 150వ జయంతి వేడుకలు రాష్ట్ర మరియు జిల్లా బిజెపి ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 31 శుక్రవారం జరిగే కార్యక్రమంలో వేములవాడ పట్టణం నుండి పెద్ద ఎత్తున తరలి రావల్సిన అవసరం ఉందని వేములవాడ పట్టణ బిజెపి అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ పిలుపునిచ్చారు. అందరూ జయంతి కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నం నరసయ్య, పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం బిసి కార్పోరేషన్‌ను పునరుద్ధరించాలి



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బిసి కార్పోరేషన్‌ను పునరుద్దరించాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం బిసి కార్పోరేషన్‌ను బిసి సంక్షేమశాఖలో విలీనం చేసి కార్పోరేషన్‌లో పనిచేసే ఉద్యోగులను బిసి సంక్షేమశాఖకు కేటాయించారని పేర్కొన్నారు. ఇప్పటికీ అన్ని జిల్లాల్లో బిసి సంక్షేమశాఖకు కేటాయించిన కార్పోరేషన్ ఉద్యోగులు రిటైర్మెంట్ అయ్యారని తెలిపారు. వారి స్థానంలో అర్హత కలిగిన బిసి సంక్షేమశాఖ జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చి వారికి బిసి కార్పోరేషన్ విధులు అప్పజెప్పాలని కోరారు. అందుకు సంబంధించిన పనుల కొరకు ప్రత్యేకమైన శిక్షణ ఇప్పించాలన్నారు. కేవలం బిసి కార్పోరేషన్ మాత్రమే బిసి సంక్షేమశాఖలో విలీనం చేశారని, మిగతా కార్పోరేషన్లు యధావిధిగా పనిచేస్తున్నాయన్నారు. జనాభాలో 52 శాతం ఉన్న బిసిలకు సంబంధించి బిసి కార్పోరేషన్ లేకపోవడం విచారకరమన్నారు. బిసి కార్పోరేషన్ ద్వారా రుణాలను, ఎంబిసి కార్పోరేషన్ ద్వారా కులాల వారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఫెడరేషన్ల రిజిస్ట్రేషన్ సంబంధించిన రుణాలన్నీ బిసి కార్పోరేషన్ ద్వారా అమలవుతాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రత్యేకమైన బిసి కార్పోరేషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, దానికనుగుణంగా బిసి సంక్షేమశాఖలో ఉన్న సిబ్బందికి ప్రమోషన్లు ఇచ్చి బిసి కార్పోరేషన్‌లో విధులను యధావిధిగా కొనసాగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

## బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పనిచేస్తున్నారని, ఆ దిశగా రూ.1.50 కోట్ల సిఎస్ఆర్ నిధులతో 15 రకాల విలువైన వైద్య పరికరాలు, సామాగ్రిని అందించారని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలగాని రాజు, జిల్లా ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, ఆస్పత్రి స్థితిగతులను గంగాడి కృష్ణారెడ్డి పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తుందన్నారు. జమ్మికుంట ప్రాంతంలో పేద మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సమస్యలకు పెద్ద దిక్కుగా ఉన్న ఆసుపత్రిలో అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుందన్నారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలకు అవసరమైన వైద్యుల కొరత ఇక్కడ తీవ్రంగా ఉందన్నారు. సరైన మందులు, ఆరోగ్య పరీక్షలు అందుబాటులో లేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇల్లందకుంట మండల అధ్యక్షుడు రమణారెడ్డి, బచ్చు శివకుమార్, కైలాసకోటి గణేష్, రాజేష్ ఠాకూర్, తిరుపతి రెడ్డి, రాకేష్ ఠాకూర్, బల్సుకూరి రాజేష్, రాచపల్లి ప్రశాంత్, రాంరెడ్డి, కేస స్వరూప, ముకుందా సుధాకర్, అప్పాల రవీందర్, ఆకుల తిరుపతి, యాంసాని సమ్మయ్య, చందా సంతోష్ తదితరులున్నారు.

## ఉద్యోగుల అంకితభావమే శాఖ ప్రతిష్టకు బలమైన పునాది



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** రాష్ట్ర ఆడిట్ శాఖ సంచాలకుడు మార్తినేని వెంకటేశ్వర్‌రావు కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆద్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సంధర్బంగా వెంకటేశ్వర్‌రావుకు శాలువా, పూలమొక్కలు, పుష్పగుచ్చాలు అందజేశారు. వేములవాడ దేవస్థానం ఆడిట్ అధికారి రాజరాజేశ్వర స్వామి వారి ప్రసాదం,కండువా సమర్పించగా ఆడిట్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి ఉద్యోగి అంకితభావం, క్రమశిక్షణ, కమిట్‌మెంట్‌తో విధులు నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి గుర్తింపు తెచ్చేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ సంబంధిత ఇబ్బందులు ఎదురైనప్పుడు తాను వ్యక్తిగతంగా పరిశీలించి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సంధర్బంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రోత్సహిస్తూ ఆన్‌లైన్ ఆడిట్ ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే దిక్సూచిగా నిలిపిన విజన్ ఉన్న వ్యక్తి డైరెక్టర్ అని కొనియాడారు. ఎన్నో బాధ్యతల మధ్య ఉద్యోగుల కుటుంబాల్లో జరిగే వివాహాల వంటి వ్యక్తిగత సంధర్బాలకు హాజరై ఆశీర్వదించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్(వరంగల్) జనరల్ పోరిక రాము, జిల్లా స్టేట్ ఆడిట్ డిడి రాజ్‌కుమార్, మున్సిపల్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ రంజిత చికిలే, డిడి వేణుమాధవరెడ్డి సుచేత, జోయల్ త్రినాథ్ దత్తు, ఆడిట్ ఉద్యోగులు ముప్పిడి కిరణ్ కుమార్, రాజేష్ భరద్వాజ్, ఏవి రాజేశ్వర్‌రావు, రామస్వామి, అల్లె శ్రీనివాస్, పవన్, కృష్ణమోహన్, శంకర్ తదితరులున్నారు.

## రాష్ట్రస్థాయి నృత్య పోటీలలో పారమిత పాఠశాల విద్యార్థిని ప్రతిభ



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్‌లోని పారమిత ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చంద్రగిరి సస్య 'సన్‌షైన్ కల్చరల్ అకాడమీ' కరీంనగర్ వారి ఆద్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సోలో వెస్టర్న్ నృత్య పోటీలలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నదని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. ఇటీవల కరీంనగర్ కళాభారతిలో సన్‌షైన్ కల్చరల్ అకాడమీ కరంనగర్ వారి ఆద్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సోలో వెస్టర్న్ నృత్య పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 60 బృందాలు పాల్గొనగా పారమిత ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విధ్యార్థిని చంద్రగిరి సస్య తన అద్భుత ప్రదర్శనతో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుందని తెలిపారు. ఈ సంధర్బంగా సస్యను పారమిత పాఠశాల అధినేత డా.ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనూకర్‌రావు, వినోదరావు, వియుయం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, సమన్వయకర్త శ్రీనాథ్, డ్యాన్స్ మాస్టర్ భీష్మరాజ్‌లు అభినందించారు.

## పాఠశాల ప్రహారీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండలంలోని కొలిమికుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల ప్రహారీ నిర్మాణ పనులకు భూమి పూజ బుధవారం చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ.18.40 లక్షల నిధులు మంజూరు చేయగా బుధవారం కొండగట్టు ఉత్సవ కమిటీ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నాయకులు, అధికారులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, కొలిమికుంట మాజీ సర్పంచ్ తాళ్లపెల్లి సుజాత శ్రీనివాస్ గౌడ్, పురం రాజేశం, పెరుమాండ్ల గంగయ్య, ముద్దం తిరుపతి, గుర్రం రమేష్, కోలపురి శ్రీకాంత్, వొల్లాల కృష్ణహరి, అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ ప్రజలున్నారు.

## యూనిట్ మార్చ్‌ను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/చొప్పదండి:** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సంధర్బంగా ఈ నెల 31న కరీంనగర్‌లో నిర్వహించే యూనిట్ మార్చ్ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మినారాయణ కోరారు. బుధవారం చొప్పదండి రూరల్ శాఖ అధ్యక్షుడు మొగిలి మహేష్ ఆద్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిజాం నియంతృత్వ పాలన నుంచి తెలంగాణ విముక్తి కల్పించిన గొప్ప నేత సర్దార్ వల్లభాయ్ పటేల్ అని పేర్కొన్నారు. ఆయన జయంతిని అన్ని గ్రామాల్లో నిర్వహించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ గొల్ల గట్టయ్య, మాజీ ఎంపిటిసి తోట కోటేష్, మాజీ సర్పంచ్ గుంట రవి, జడ్పిటిసి కన్వీనర్ సింగిరెడ్డి భూమిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బైరగోని కిట్టుగౌడ్, విలాసాగరం అంజయ్య, తిరుపతి, ఎడ్ల సురేష్, వెంకటేష్, అఖిల్, వేణు, రాజారాం, కాయిత సాయి పాల్గొన్నారు.

## గుమ్లాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆద్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు రూపిరెడ్డి స్కైలాబ్ సత్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఉప్పు కరుణాకర్, కొలపురి హన్మంత్, వెల్మ రఘుపతి రెడ్డి, పడిశెట్టి భద్రయ్య, బీసావేణి రాజశేఖర్ గౌడ్, మహిళా రైతులు మునిగాల వజ్రమ్మ, కంది అంజయ్య, అప్పిడి లక్ష్మారెడ్డి, బీసావేణి వెంకటస్వామి గౌడ్, కదారి గంగరాజు, మండల లక్ష్మణ్, వెన్నం సత్యనారాయణ రెడ్డి, మెండె వెంకటి, బొడిగె శేఖర్, రాజయ్య, లక్ష్మి రాజం, చిర్ర అంజయ్య రైతులు పాల్గొన్నారు.

# రైతులకు పంట ఉత్పత్తిపై శిక్షణ సమావేశం



**ప్రజాపక్షం/ముత్తారం:** ముత్తారం మండలంలోని లక్కారం గ్రామంలో ఆర్‌వి ప్రాజెక్టు లో భాగంగా బుధ వారం రైతులకు శిక్షణ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో ఆర్.వి ప్రాజెక్టు ఫీల్డ్ ఆఫీసర్ ఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ పునరుజీవ పంట ఉత్పత్తిపై ముఖ్యమైన అంశాలను వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులు కవర్ క్రాపింగ్ సంరక్షణ పద్ధతులు పంట మార్పిడి బహు పంటలు అంతర పంటలు శాశ్వత పంటలు సహజ ఎరువులు రసాయన ఎరువులు తగ్గింపు క్రిమిసంహారక రసాయనల తగ్గింపు పురుగు మందులు పిచికారి చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,నీటి వినియోగ సామర్థ్య చర్యలు బాల కార్మికుల నిర్మూలన, కార్మికుల వేతనం, హక్కుల గురించి, పత్తి వేరేటప్పుడు నీలువ చేసేటప్పుడు రవాణా చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించడం జరిగింది.శిక్షణ కార్యక్రమం అనంతరం రైతులకు వేప నూనె పి.ఎస్.బి లింగాకర్షక బుట్టలు జిగురు అట్టలు విటా ప్రో కె.పి.పి.ఈ కిట్లు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సెక్రటరీ దిలీప్, క్షేత్ర పరిశీలకులు ఎస్.రాజశేఖర్ ,ఎస్.రాజు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రామాలయ నిర్మాణానికి విరాళం

**ప్రజాపక్షం/కొడిమ్యాల:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని పూడూర్ గ్రామంలో రామాలయ నిర్మాణానికి పెద్ది మల్లవ్వ నర్సయ్య సన్ఆఫ్ పోచయ్య పూడూర్ వారు 11116 రూపాయలు విరాళంగా ఇచ్చారు. దాతలకు రామాలయ కమిటీ సభ్యులు కదారి మల్లుశం, వడ్లకొండ నర్సయ్య, పైడిపల్లి సతీష్‌రావు, తెలిపారు.

## అసభ్యకరమైన సైగలు చేసిన వ్యక్తి రిమాండ్

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ దేవస్థానం సమీపంలో వెల్దండి సదానందం ఒక మహిళకు అసభ్యకరమైన సైగలు చేస్తున్నాడని వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు సంబంధిత ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి, నిందితుడు వెల్దండి సదానందంను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. సార్వజనిక ప్రదేశాల్లో మహిళల పట్ల అసభ్య ప్రవర్తన కనబడినచో వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి. వీరప్రసాద్ కోరారు.

## బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల విజయఢంక

**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని ఐఐటీ మద్రాస్ వారి స్కూల్ కనెక్ట్ కార్యక్రమంలో పియంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. ఇందులో భాగంగా నిర్వహించిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులలో 11మంది విద్యార్థిని విద్యార్థులు డాటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఆర్కిటెక్చర్అండ్ డిజైనింగ్ వంటి ఇంజనీరింగ్ కోర్సులలో 8 వారాల పాటు ఆన్ లైన్లో శిక్షణ తీసుకొనున్నారు. 11 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఐఐటీ మద్రాస్ వారిచే సర్టిఫికెట్లు పొందినారు.ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.గంగాధర్ , ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## గాలికుంటు వ్యాధికి ఉచిత టీకా

**ప్రజాపక్షం/కొడిమ్యాల:** పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని కోనాపూర్ గ్రామంలో పశుసంవర్ధక ఆధ్వర్యంలో వేపదుతున్న పశువులకు టీకాల కార్యక్రమాన్ని పశుసంవర్ధక వైద్య అధికారి డాక్టర్ ప్రకాష్ సందర్శించారు. అనంతరం డాక్టర్ ప్రకాష్ పాడి రైతులతో మాట్లాడుతూ గాలికుంటు టీకాల ద్వారా పశువులకు వ్యాధుల నుంచి రక్షణ లభించడమే కాకుండా వాటి ఉత్పత్తి కూడా మెరుగుదల కలుగుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాకేష్, గోపతి కమలాకర్, ఉదయ్, పాడి రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ నూతన గ్రామకమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ముత్తారం :** తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి,మంథని డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీమల సందీప్ ఆదేశాల మేరకు ముత్తారం మండలం లక్కారం గ్రామంలో బుధవారం ముత్తారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బక్కతట్ల వినీత్ యాదవ్,గ్రామ కమిటీ ఎన్నిక ఇంచార్జి బియ్యని శివ కుమార్ ఆధ్వర్యంలో లక్కారం యూత్ కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.లక్కారం యూత్ కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీ అధ్యక్షులు గొడ్డేటి హరీష్,ఉపాధ్యక్షులు ఐతం రాజు, ప్రధానకార్యదర్శి ఎదుమెకల కుమార్,కార్యదర్శి భాషవేణ అశోక్, కోశాధికారి దొంతరవేన కుమార్,అధికార ప్రతినిధిగా దొంతరవేన రాజు,ప్రచార కమిటీ కన్వీనర్ భాషవేణ సతీష్,కార్యవర్గ సభ్యులుగామదసి శివకుమార్, బయ్యా ధనుష్, కరుపాకల ప్రవీణ్, పార్వవేన ప్రశాంత్,మదసి శ్రీకాంత్, రమేష్, దొంతరవేన కుమార్,పంజాల అశ్విన్, భాషవేణ అశోక్, రాకేష్ లను ఏన్నుకున్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీని భలోపేతం చేయడానికి ఉత్సాహంగా పనిచెయ్యాలని, రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో సైనికుడిలా పనిచేసి పార్టీ గెలుపు కోసం కృషి చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంజాల కుమారస్వామి,దశరథంరాంబాబు, తాళ్ళపల్లి బలయ్య, మదాసి రాజయ్య, ఎర్రన్న, చల్లూరి కృష్ణమూర్తి, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెండింగ్ ఫీజులను వెంటనే విడుదల చేయాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెండింగులో ఉన్న రూ.7వేల 5వందలకోట్ల ఫీజు రీయింబర్సుమెంటు స్కాలరుషిప్పులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాకేం ద్రంలో బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ, ఏళ్ళ తరబడిగా ఫీజు రీ రీంబర్సు మెంటు,స్కాలరుషిప్పులు విడుదల చేయని కారణంగా విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళ కావొస్తున్నా పెండింగ్ బకాయిలను చెల్లించ కుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. రీంబర్సు మెంటు, స్కాలరుషిప్పులు విద్యార్థుల హక్కని, వాటిని ఇవ్వకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తోందని ధ్వజమెత్తారు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి అయిన తర్వాత కూడా సర్టిఫికెట్స్ రాక ఒకవైపు, ఉన్నత విద్యకు మరొకవైపు ఉద్యోగ అవకాశాలు వచ్చినా కూడాసర్టిఫికెట్స్ లేని కారణంగా విద్యార్థుల జీవితాలు అంధ కారంలోకి నెట్టి వేయబడుతున్నాయన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, విద్యావ్యవస్థ తీరు మారడం లేదని నిస్సహాయత వ్యక్త పరిచారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే దిశగా ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఒకవేలం ప్రభుత్వ, ఉద్దేశ్యం అదే అయితే గనక కాంగ్రెస్ భరతం పడతామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో సందీప్‌ప్రవీణ్, అజయ్,అరవింద్, అరవింద్ గణేష్, దినేష్, జశ్వంత్ దేవా, విగ్నేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ బీభత్సం... హుజురాబాద్ జలమయం

**ప్రజాపక్షం/హుజురాబాద్:** మొంథా తుఫాన్ ప్రభావంతో హుజురాబాద్ పట్టణంలోని పలు కాలనీలు నీట మునిగాయి. బుధవారం ఉదయం నుండి సాయంత్రం 5 గంటల వరకు కొన్ని గంటల్లోనే రికార్డు స్థాయి లో 15 సెంటీమీటర్ల భారీ వర్షాపాతం నమోదు కావడంతో పట్టణంలో ఎటు చూసినా వరద నీరే కనిపిస్తుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా పట్టణంలోని మామిళ్లవాడ, కాకతీయ కాలనీ, బుడగ జంగాల కాలనీ, విద్యానగర్‌తో పాటు పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. కాలనీల రోడ్లు చెరువులను తలపిస్తుండగా, అనేక ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు దెబ్బతిన్నాయి. అంతా ఒక్కసారిగా నీరు ముంచెత్తి ఇళ్లల్లో మోకాలి లోతు నీరు చేరింది. బియ్యం, పప్పులు అన్ని తడిసిపోయాయి. రాత్రంతా ఎలా గడపాలో తెలియడం లేదని బుడగ జంగాల కాలనీకి చెందిన ఓ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రజలు తమ ఇళ్లలోకి చేరిన నీటిని బిందెలతో, బకెట్లతో బయటికి తోడే పనిలో నిమగ్నమై ఉన్నారు. భారీ వర్షానికి వరంగల్ రోడ్డుపై డిపో రోడ్డు నుండి హెచ్‌పి పెట్రోల్ పంప్ వరకు పెద్ద ఎత్తున నీరు చేరడంతో ఆ మార్గం చెరువును తలపించింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదాలకు భయపడి చాలా మంది వాహనాలు ముందుకు పోవడానికి వెనుకంజ వేశారు. రోడ్డుపై నిలిచిపోయిన నీటిని తొలగించేందుకు మున్సిపల్ సిబ్బంది జెసిబి సహాయంతో పనులు చేపట్టారు. పట్టణాన్ని ఆనుకుని ప్రవహించే చిలుక వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ కారణంగా వడ్డెర కాలనీతో పాటు కనుకుల గిద్ద గ్రామాలతో హుజురాబాద్‌కు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

**మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక.**

తుఫాన్ మరింత తీవ్ర రూపం దాల్చి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు అప్రమత్తం అయ్యారు. మున్సిపల్ కమిషనర్ కే. సమ్మయ్య పట్టణంలో పర్యటిస్తూ నీటిని పారించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు దాటడానికి ప్రయత్నించవద్దని అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, తగిన జాగ్రత్తలు వహించాలని మున్సిపల్ కమిషనర్ పట్టణ ప్రజలకు సూచించారు.

## మానేరు పరివాహ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మానేరు పరివాహ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిడ్ మానేర్ రిజర్వాయర్ నుండి వస్తున్న వరద డ్యామ్ లోకి వచ్చి చేరుతుండడంతో దీనితో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు 6 గేట్ల గేట్లు ఎత్తి 12.000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలే అవకాశం ఉన్నందున ప్రాజెక్టు దిగువన నది పరిసర ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే పశువుల కాపర్లు, గొర్ల కాపరులు, చేపలు పట్టేవారు, రైతులు, ప్రజలు మానేరు నదిని దాటే ప్రయత్నాలు చేయవద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ విజ్ఞప్తి చేశారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

**ప్రజాపక్షం/ముత్తారం:** క్రిమిసహారక మందు త్రాగి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలో చోటు చేసుకుంది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం రాయినేని గట్టయ్య లక్ష్మి ల కుమారుడు రాయినేని రాకేష్ (25) మంగళవారం రోజున గడ్డి మందుతాగారు. వి సంఘటన గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ విషయంపై ఎస్సై రవికుమార్ ను వివరణ కోరగా పోలీస్ స్టేషన్ లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## పరామర్శ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర పల్లి చెందిన సుంచు రమేష్ ప్రథమ వర్ధంతి బుధవారం నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి చంద్రమౌళి గౌడ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బంధారపు నారాయణ గౌడ్ పాల్గొని మృతుడి చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు.

## గాయత్రి 10 మంది విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేత

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** బుధవారం రోజున పెద్దపల్లి గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ 45 రోజుల ఇంటర్న్ షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఐపిపిబి సీనియర్ మేనేజర్ రాజేష్ ,మేనేజర్ మోహన్ మాట్లాడుతూ గాయత్రి కళాశాల నుండి 10 మంది విద్యార్థినీ ,విద్యార్థులు బ్యాంకు సేవలు ,డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, ఫైనాన్షియల్ ఇంక్లూషన్, కస్టమర్ సర్వీస్ తదితర అంశాలపై ప్రాయోగిక అనుభవాన్ని పొందారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అల్లంకి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్న్ షిప్ పూర్తి చేసిన విద్యార్థిని ,విద్యార్థులు కళాశాల కరస్పాండెంట్ అల్లంకి శ్రీనివాస్, పోస్ట్ ఆఫీస్ అధికారులకు, మరియు అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ అవకాశాన్ని అందించిన వారికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

## డిసెంబర్ 31వరకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ దరఖాస్తు గడువు పొడిగింపు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** 2025–26 విద్యా సంవత్సరంలో పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ ల దరఖాస్తు గడువు డిసెంబర్ 31 వరకు పొడిగించడం జరిగిందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి జే.రంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న అర్హులైన మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులు,కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ కళాశాలల్లోని విద్యార్థిని, విద్యార్థులు అందరూ వారి అర్హతలను బట్టి ఉపకార వేతనాలను https://telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ లో డిసెంబర్ 31, 2025 లోపు ఫ్రెష్, రెన్యువల్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ఆయా కళాశాల ప్రిన్సిపాల్ ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి జే.రంగారెడ్డి ఆ ప్రకటనలో కోరారు.



## పార్టీలకు అతీతంగా ముదిరాజులు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలి

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ముదిరాజ్ కుల బాంధవులు పార్టీలకతీతంగా ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు చిట్యాల లక్ష్మణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పాతధామ్రాజ్ పల్లి, వాల్గోండా, కొత్త దామరాజు పల్లి ఓబులాపూర్ మొగిలిపేట గ్రామాలలో ముదిరాజ్ కులస్తులను కలిసి చర్చించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు నెంబర్ నుండి జెడ్పిటిసి స్థాయి వరకు ముదిరాజులు పోటీలో ఉండాలని రాజ్యాధికార వాట కోసం పోరాడాలని ముదిరాజుల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బోయిని హనుమాన్లు, ప్రధాన కార్యదర్శి దండవేణి రాజేందర్, సభ్యులు పల్లి మధు, బోండ్ల రవి తదితరులు ఉన్నారు.



## సింగరేణి క్రీడలలో గాయపడిన క్రీడాకారుడుకి మెరుగైన వైద్యం

**ప్రజాపక్షం/రామగిరి :** సింగరేణి వ్యాప్తంగా జరుగుతున్న క్రీడలలో భాగంగా ఆర్జీ3ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జవ్వాజి. అంజి కబడ్డీ ఆడుతుండగా ప్రమాదవశాత్తు కాలు విరగడంతో వెంటనే గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.ఈ విషయం తెలిసిన వెంటనే ఆర్జీ3 ఏరియా ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి సింగరేణి గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి వెళ్లి సీఎంఓ తో మాట్లాడి అంజి కి మెరుగైన వైద్యం అందించేందుకు కరీంనగర్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌కి రిఫరల్ చేయించారు కరీంనగర్ కి వెళ్లి అంజి నీ పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని, ధైర్యంగా ఉండాలని తెలిపి మెరుగైన వైద్య సేవలు అందించాలని హాస్పిటల్ యజమాన్యాన్ని కలిసి మాట్లాడరు కార్మికులు క్రీడల్లో పాల్గొనేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని,యాజమాన్యం కూడా ప్రమాదాలు జరగకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పరామర్శించిన వారిలో ఐఎన్టిసి కేంద్ర కార్యదర్శి, జిఎం కమిటీ సభ్యుడు ఎల్లంకి రామారావు, బ్రాంచ్ సెక్రటరీ బెల్లం శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

### ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

# అర్హులైన పేదలకు ఇవ్వాలి

ప్రజాపంథా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవారం




**ప్రజాపక్షం/మోర్తాడ్ :** అర్హులైన పేదలకు మోర్తాడ్ మండల కేంద్రంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించాలని బుధవారం ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి మోర్తాడ్ తహసీల్దార్‌కు మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రజపంథా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవారం మాట్లాడుతూ.. 1994లో ధోన్‌పాల్ గ్రామంలో ఇళ్ల పట్టాల పంపిణీ జరిగింది. కానీ అక్కడ ధనిక కుటుంబాలకు చెందిన వారు పేదలకు ఇవ్వకుండా అడ్డం పడుతున్నారని వారు తెలిపారు. అదేవిధంగా కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మోర్తాడ్ మండల కేంద్రంలో పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించడం జరిగిందని, సుమారు 200పై చిలుకు ఇండ్ల నిర్మాణాలు జరిగితే కేవలం 160మాత్రమే అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసి మిగతా వాటిని అపడంతో పేద ప్రజలకు ఇల్లు లేని వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు అన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన అని మాటలకే కాంగ్రెస్ ప్రభుత్వ పరిమితమవుతుందని అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న అల్రెడీ నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూములు పంచకుండా నిర్లక్ష్యం చేయడం సిగ్గుచేటని అన్నారు. కాబట్టి తక్షణమే మిగిలిన 65ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ జిల్లా అధ్యక్షుడు సారా సురేష్, మోర్తాడ్ మండల కార్యదర్శి జి.కిషన్, కమ్మర్‌పల్లి మండల కార్యదర్శి అశోక్, మాస్ లైన్ జిల్లా ప్రజాపంథా మాస్‌లైన్ ఆర్మూర్ సంయుక్త మండలాల కార్యదర్శి జి.కిషన్, సత్యక్క, దయాల్‌సింగ్, అరుణ, అంజలి, డాక్టర్ శ్రీనివాస్, రాములమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## సోయాబిన్‌ను కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలి

కుంట రమేష్ రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడు



**ప్రజాపక్షం/బోధన్ :** సోయాబిన్ ను రైతులు కొనుగోలు కేంద్రంలోనే అమ్మి మద్దతు ధరను పొందాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి సూచించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం కల్దుర్కి గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోయాబిన్ కొనుగోలు కేంద్రంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సోయాబిన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటి సోయాబిన్ కొనుగోలు కేంద్రం బోధన్ మండలంలో ప్రారంభించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ ఘనత తనకు స్థానిక ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి వల్లే దక్కిందన్నారు. రైతులు సోయాబిన్ ను దళారులకు అమ్మి మోసపోకుండా కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ఈ కొనుగోలు కేంద్రాన్ని సోయాబిన్ రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ తహసీల్దార్ విటల్, మార్కెట్ కమిటీ ఇన్‌ఛార్జి అధ్యక్షులు చీల శంకర్, ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు శరత్ రెడ్డి, సంఘం కార్యదర్శి శ్రీనివాస్, స్థానిక నాయకులు గంగా శంకర్, నాగేశ్వర్ రావు, నరేందర్ రెడ్డి, వసంత రెడ్డి, శంకర్, రైతులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

### మోదీ, బిజెపి, ఎస్సీ వర్గీకరణ పేరుతో

# దళితుల ఐక్యతపై దేశవ్యాప్త కుట్ర

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మోదీ, బిజెపి, ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై దేశవ్యాప్త కుట్ర అనినేషనల్‌ప్రెసిడెంట్ ఫర్ మాలమహానాడు అండ్‌రాక్స్ డాక్టర్ ఆర్ఎస్.రత్నాకర్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసినవిలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసలు ఎస్సీ వర్గీకరణను శాంపుల్‌గా పంజాబ్ హర్యానాలో మొట్టమొదటిగా ఈ దేశంలో చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనన్నారు. బీజం కాంగ్రెస్ పార్టీ వేస్తే దీన్ని దేశం మొత్తం చేశాడు మోడీ అన్నారు. దేశంలో అందరి కన్నా ముందుగా ఎస్సీ వర్గీకరణ తెలంగాణ రాష్ట్రం చేయడం, దాన్ని కర్ణాటక కాంగ్రెస్ సర్కార్ ఫాలో అవ్వటం, దేనికి నిదర్శనం ? రాహుల్‌గాంధీకి ఇదంతా తెలిసే జరుగుతుందా అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ అనేది సామాజికన్యాయం అనిడప్పు కొట్టుకునే రేవంత్ రెడ్డి ఈ సామాజిక న్యాయం ఎస్సీలకు రిజర్వేషన్ పేరుతో పడేసే కేవం ఎంగిలి మెతుకుల్లోనేనా ? ఈ దేశ సంపద, సిఎం పదవి, మంత్రి పదవులు ఈ దేశ పరిశ్రమలు జడ్జెస్ నియామకాలు, పరిశ్రమల్లో అక్కర్లేదా ? రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. నిజానికి ఎస్సీ వర్గీకరణ వల్లవందలోనలుగురికే బెనిఫిట్ జరుగుతోందని, ఈ వందలోనలుగురికి ఇచ్చే ఈ ఫలాలను దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్ట్‌లో ఉన్న 1108 ఎస్సీ కులాలకు మోడి ఎలా పంచుతారన్నారు. అలాగే ఈ నాలుగు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఎలా పంచుతారన్నారు. ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని ప్రశ్నిస్తూ ఉన్నాను. చంద్రబాబు మాల సామాజిక వర్గంపై ప్రకటించుకుంటే తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి మాలలపై తనకు ఏ విధమైన ఈర్ష్యద్వేషాలు ఉన్నాయో చేసి చూపించాడన్నారు. మాలల హోల్‌సేల్ మేనమామ మాలలకు అన్యాయంజరుగుతున్న ముద్దులతో సరి పెట్టేసాడుతప్ప ఈనాటికి స్పందించలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయినవి కదా, ఇక చేసేదే ముందనిఅనుకోకండన్నారు. ప్రజలు తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందేనని గుర్తుచేశారు.తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తా ఉంటే మాల ప్రజాప్రతినిధులు నోరు మెదకపకపోవటం ఘోరం అన్యాయంచెంచాగిరికి అలవాటు పడ్డ మాల నాయకులు రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారే తప్ప జాతి పట్ల విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించాలన్నారు. రిజర్వేషన్లు బెనిఫిట్ పొందిన మాల ఉద్యోగులరా మాల జాతిని తొక్కేస్తా ఉన్నారు.

ఇకనైనా కళ్లు తెరిచి బయటకు రండి మా ఈ పోరాటానికి మద్దతు ఇవ్వండన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఏనాడు ఎదుర్కొనటువంటి గడ్డు పరిస్థితిని మాల సామాజిక వర్గం ఈ రోజు ఎదుర్కొంటూ ఉందన్నారు. పూర్తిగా తెలుగు రాష్ట్రంలో మన కులం ఉనికిని కోల్పోయాం. శాంతియుత పోరాటానికి సిద్ధంకండన్నారు. కార్యక్రమంలో గైని గంగారాం, సక్కి ప్రభంజన్, సంజీవ్, లక్ష్మణ్, బాలశౌరి, ప్రేమ్‌బాబు, సూరిబాబు, నాని పాల్గొన్నారు.



## గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** వేల్పూర్ గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు బుధవారం పశు వైద్యాధికారి సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో వేశామన్నారు. నాలుగునెలలకు పైబడిన గోజాతి, గేదెజాతి పశువుల అన్నింటికి తప్పకుండా టీకాలు వేయించుకోవాలని వివరించారు. గాలికుంటు వ్యాధి ప్రబలినచో నోటిలో పుండ్లు ఏర్పడుతాయి, కాళ్ల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడుతాయి నడవడానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. పశువులలో అధిక మొత్తంపాల దిగుబడి తగ్గి పాడి రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. కావున అందరూ తప్పకుండా తమ పశువుల అన్నింటికి టీకాలు వేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది సురేష్, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ గంగాధర్, లైవ్ స్టాఫ్ అసిస్టెంట్ దయానంద్, బాబులాల్ పాల్గొన్నారు.



## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

-బిఆర్ఎస్ వి జిల్లా అధ్యక్షులు కొయ్యాడ సతీష్ గౌడ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణలో విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని, తెలంగాణకు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండడం విద్యార్థుల దౌర్భాగ్యమని, పెండింగ్ లో ఉన్న ఫీజులను వెంటనే చెల్లించాలని బి ఆర్ఎస్వి జిల్లా అధ్యక్షులు కొయ్యాడ సతీష్ కుమార్ అన్నారు.బిఆర్ఎస్వి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఫీజు రియంబర్మెంట్స్ విడుదల చేయాలని కోరుతూ మంగళవారం రోజున పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి, జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కొయ్యాడ సతీష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల ఓట్లతో గద్దెనక్కి పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తూ పేద విద్యార్థుల జీవితాలతో చెలగాట మారుతున్నారని, ప్రభుత్వం నుంచి రావలసిన ఫీజు రియంబర్మెంట్స్ ను విడుదల చేయకుండా విద్యాశాఖను భ్రష్టు పట్టిస్తున్నారని, ఇప్పటివరకు కీలకమైన విద్యా శాఖను ఎవరికి ఇవ్వకుండా తన వద్ద ఉంచుకొని ఇంజనీరింగ్, డిగ్రీ, డిప్లమా విద్యార్థులకు రావాల్సిన బకాయిలను సకాలంలో అందించకుండా నిర్వీర్యం చేస్తున్న రేవంత్ రెడ్డి వెంటనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి ఇప్పటివరకు రియంబర్మెంట్స్ ఇవ్వకుండా కాలయాపన చేస్తూ ఇంజనీరింగ్ కళాశాలలు మూతపడే దుస్థితి కి తీసుకువచ్చిన రేవంత్ రెడ్డికి విద్యార్థులే తగిన గుణపాఠం చెప్తారని,10,000 కోట్లు బకాయిలు ఉన్న దసరాకి దీపావళికి ఇస్తానని నమ్మబలికి ఎట్టకేలకు విద్యార్థులను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం తప్పదనీ,వెంటనే ఫీజు రియంబర్మెంట్స్ విడుదల చేయని యెడల రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గోరి కడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ZPTC వంగల తిరుపతిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, నూనెటి కుమార్ యాదవ్, మ్యదగోని శ్రీకాంత్ గౌడ్, సిలివేరి లవన్ కుమార్, కర్ర దేవేందర్ రెడ్డి, మహమ్మద్ ఖాదర్, ఉప్పు శివకుమార్, బండి సురేష్, సాయి, ఆజాం,గడ్డం అజయ్, గడ్డం శ్యామ్, కుక్క మనోజ్, వినయ్, కుంభం రాజు, ధర్ముల రవి, తాండ్ర అనిల్, కల్లేపల్లి సాగర్, శ్యామ్,ట్రినిటీ, మదర్ తెరిసా, గాయత్రి కాలేజీ విద్యార్థులు సుమారుగా 2000 మంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య



ప్రజాపక్షం/మంచిర్యాల : అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఉప తహసిల్దార్ సంతోష్ తో కలిసి ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్నం భోజనంలో పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందని, ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యా బోధన అందిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ సందర్శన సమయంలో ఆయన తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదలే విజయానికి మొదటి సోపానం



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :విద్యార్థి జీవితం లో పట్టుదల,శ్రద్ధ అతి ముఖ్య మైనవని పట్టుదలే విజయానికి మొదటి సోపాన మని హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు.బుధవారం దిలావార్ పూర్ మండల కేంద్రము లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ప్రేరణాత్మక ప్రసంగమిచ్చారు.ప్రస్తుత సమాజం లో నిజాయితీ లోపించడం వల్లనే ఎన్నో అరాచకాలు జరుగుతున్నాయని చెప్పారు.ప్రతి ఒక్కరు నిజాయతి కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.పట్టుదలతో పని చేయడం వల్లనే అనేక మంది పేదవారు సైతం ఎంతో ఉన్నత స్థితికి చేరినారని అందుకు అబ్దుల్ కలాం,లాల్ బహదూర్ శాస్త్రి మొదలైన వారే నిదర్శనమని చెప్పారు.పేదరికం చదువుకు అడ్డుకారాదని,ప్రభుత్వం అందించే అనేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని జీవితం లో ఎదుగాలని సూచించారు.విద్యార్థులకు విలువైన ఎన్నో సందేశాలను ఉదాహరణలతో వివరించారు.విద్యార్థులతో మాటా మంచి కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానిచ్చారు.ఈ కార్యక్రమంలు మండల విద్యాధికారి కె.శంకర్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. పాఠశాల బోధన,బోధనాతర సిబ్బంది.విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యార్థుల బ్యాంకు ఖాతా వివరాలను సవరించుకోవాలి

జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి

ప్రజాపక్షం/నస్పూర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తమ విద్యార్థుల బ్యాంకు ఖాతా, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ వివరాలను సవరించుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటిఎఫ్ ప్రొసీడింగ్ లను జనరేట్ చేసి ట్రెజరీకి అప్‌లోడ్ చేసినపుడు విద్యార్థుల ఈ పాస్ బ్యాంక్ ఖాతా, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ సరిగా లేదని చూపిస్తుందని, ఈ కారణంగా బిల్లులు ట్రెజరీకి అప్లోడ్ చేయడం సాధ్యం కాదని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల బ్యాంకు ఖాతా, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ తనిఖీ చేసుకోవాలని, సవరించేందుకు, ఎంటిఎఫ్ బిల్లులు జారీ చేయడానికి జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్ 5 లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో పూర్తి వివరాలతో జాబితా తయారుచేసి ఆయా కళాశాలల కవరింగ్ లేఖలతో సమర్పించాలని తెలిపారు.

# ముధోల్ శివారులో చిరుత ఆనవాళ్ళు...

ప్రజాపక్షం/ముధోల్ : మండల కేంద్రమైన ముధోల్ లోని కంటి ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో బుధవారం వేకువజామున చిరుత పులి జాతీయ రహదారి నుండి తరోడా తండా వైపు వెళ్ళినట్లు చూసిన ప్రయాణికులు తెలిపారు.విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు బిట్ ఆఫీసర్ కృష్ణ,సెక్షన్ అఫీసర్ లక్ష్మన్ పరిసర ప్రాంతాల్లో పరిశీలించిన కొలతలు తీసుకున్నారు.చిరుత కాళ్ళ ఆనవాళ్లను గుర్తించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.జలాల్ సాబ్ చెరువు సమీపంలో ఇటీవల చిరుతపులి సంచరించడం రైతులను భయాభ్రాంతులకు గురిచేసింది.అడవుల నుండి జనసంచార ప్రాంతాల్లో చిరుత సంచరించడం ప్రజలకు ఆందోళన కలిగించే విషయమే.పంట పొలాల్లో వెళ్లే సమయంలో ప్రజలు జాగ్రత్తా ఉండాలని అధికారులు ఇప్పటికే సూచించారు.అడవుల నుండి క్రూరమైన జంతువులు గ్రామాలకు సమీపంలో రావడం ప్రజలకు భయాభ్రాంతులకు గురిచేస్తుంది.అటవీ శాఖ అధికారులు సైతం స్పందించి ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు క్రూరమైన జంతువులు జనావాసాల్లోకి రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# సిబ్బందికి,అధికారులకు వ్యాసరచన పోటీలు..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని,జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ ఆదేశాల మేరకు,ఏఆర్ ముఖ్య కార్యాలయంలో పోలీస్ సిబ్బంది అధికారులకు ఎస్సే రైటింగ్(వ్యాసరచన) పోటీని నిర్వహించారు.ఈ పోటీలో పాల్గొన్న వారికి వారి హోదాలను బట్టి వేర్వేరు అంశాలను కేటాయించారు.కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ వరకు ఉన్న సిబ్బందికి "పని చేయు ప్రదేశంలో లింగ వివక్ష(Gender Discrimination in the Workplace)అనే అంశంపై వ్యాసరచన నిర్వహించారు.ఎస్ఐ నుండి ఆ పై స్థాయి అధికారులకు "గ్రౌండ్ లెవెల్ లో పోలీసులు బలోపేతం చేయడం(Strengthening Police at Ground Level) అనే అంశాన్ని కేటాయించారు. ఈ కాంపిటీషన్‌లో ఐదుగురు ఆర్. ఎస్. ఐలు, నలభై ఆరుగురు(46) మంది హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.మొత్తం ఆరుగురిని(కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ వరకు ముగ్గురు,ఎస్ఐ నుండి పై స్థాయి అధికారి వరకు ముగ్గురు)సెలెక్ట్ చేసి,వారి పేర్లను రాష్ట్ర స్థాయికి పంపించడం జరుగుతుంది.రాష్ట్ర స్థాయిలో ఎంపికైన పోలీస్ అధికారులు,సిబ్బందికి అప్రిసియేషన్ సర్టిఫికెట్,నగదు రివార్డు అందజేయడం ద్వారా సత్కరిస్తారు.పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



# గాలికుంటు టీకాల కార్యక్రమం ప్రారంభం



ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమం మొదలైందని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సహాయంతో పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు అందించడం జరుగుతుందని మండల పశువైద్యాధికారి రాకేష్ తెలిపారు. బుధవారం పెంచికల్‌పేట్ మండలంలోని మురళిగూడ, జిల్లేడ గ్రామాలలో మూడు నుండి నాలుగు నెలల వయసు పైబడిన అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. రైతుల సహకారంతో ఈ టీకాల కార్యక్రమం విజయవంతమైందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వితంతువులకు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం

ప్రజాపక్షం/హాజీపూర్ : భర్తను కోల్పోయిన వితంతువుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ ప్రయోజన పథకం ద్వారా రూ. 20 వేల ఆర్థిక సహాయం అందించబడుతుందని హాజీపూర్ మండల తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్ పాండే తెలియజేశారు. ఈ పథకం కింద అర్హత గల బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం మంజూరు చేయబడుతుందని ఆయన తెలిపారు. అర్హత కలిగిన ప్రతి వితంతువు ప్రభుత్వ సహాయాన్ని వినియోగించుకోవాలని, అర్హులు అవసరమైన పత్రాలతో తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

# రికార్డు స్థాయిలో రక్త సేకరణ: 246 యూనిట్లు



ప్రజాపక్షం/బెల్లంపల్లి: పోలీసు అమరవీరుల సంస్మరణ ఉత్సవాలలో భాగంగా బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీసులు బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్‌లో జరిగిన ఈ శిబిరంలో మొత్తం 246 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీసు సిబ్బంది అంతా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. బెల్లంపల్లి చుట్టుపక్కల గ్రామాల యువకులను ప్రజలను ప్రోత్సహించి రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను పోలీసు యంత్రాంగం వివరించింది. ఈ సందర్భంగా ఏసిపి రవికుమార్, పట్టణ సిఐ కె శ్రీనివాసరావు, రూరల్ సిఐ హనూక్ ఇతర ఎస్ఐలు సిబ్బంది స్వయంగా రక్తదానం చేశారు. బెల్లంపల్లి చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. మొత్తం 246 యూనిట్ల రక్తాన్ని సేకరించి, రామగుండం కమిషనరేట్ లోనే అత్యధికంగా రక్తదాతలను సేకరించిన ఘనతను బెల్లంపల్లి సబ్ డివిజన్ దక్కించుకుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బెల్లంపల్లి సబ్ డివిజన్ ప్రజలకు, పట్టణ ప్రజలకు, యువతకు, అన్ని వర్గాల వారికి రెడ్ క్రాస్ బృందానికి ఏసిపి రవికుమార్, పట్టణ సిఐ కె శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ హనూక్, మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి, తాండూర్ సిఐ దేవయ్య, బెల్లంపల్లి సబ్ డివిజన్ సంబంధిత ఎస్ఐలు కానిస్టేబుల్ పోలీస్ సిబ్బంది, యువతీ యువకులు పాల్గొన్నారు.

# మెగా ఉచిత వైద్య శిబిరం..




**ప్రజాపక్షం/బైంసా :** బైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వాటోలి గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరం ఐదవ రోజు ఆరోగ్య అవగాహన కార్యక్రమం గ్రామ ప్రజల అపార స్పందనతో విజయవంతంగా నిర్వహించబడింది.గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా మధుమేహం,రక్తపోటు పరీక్షలు,సాధారణ,దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 250 మందికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.ఈ సేవలో 10 మంది వైద్యుల బృందం పాల్గొని,మొత్తం లక్ష రూపాయల విలువైన మెడిసిన్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు.మెడిసిన్ పంపిణీలో సిపిడిసి సభ్యుడు నిఖిల్ మెడికల్ ప్రత్యేక సహాయం,ల్యాబ్ టెక్నీషియన్స్ బాలాజీ,సాయికుమార్ సేవలు అందించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు డా.నగేష్, డా.ముత్యంరెడ్డి,డా.మహేష్.డా.విజయానంద్, డా.చంద్రశేఖర్, డా.వైభవ్,డా.మనోజ్,డా.ఆకాష్‌రెడ్డి తదితరులు గ్రామస్తులను వైద్యులు నిర్వహించి వారికి వివిధ సూచనలు చేసి,మందులను పంపిణీ చేశారు.మధ్యాహ్నం విద్యార్థుల కోసం న్యాయవాదులు టి.గంగాధర్ మాధవి లీగల్ అవేర్నెస్ చట్ట అవగాహన,మోటివేషన్ క్లాస్ నిర్వహించి,విద్యార్థులు సమాజంలో ఎలా ఉండాలి,చట్టపరమైన అంశాల్లో ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలి వంటి కీలక విషయాలను వివరిస్తూ వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్ కరోల బుచ్చయ్య,మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉచిత వైద్య సేవలు దగ్గరుండి వారికి ఏ విధంగా పరీక్షలకు చేసుకోవాలని అవగాహన కల్పిస్తూ పలు రకాలుగా తమల సేవలను వినియోగించడం అభినందనీయమని అనంతరం గ్రామంలో ఉన్న ప్లాస్టిక్ కులపైన అవగాహన కల్పించి ప్లాస్టిక్ వల్ల మానవాళికి ఎటువంటి అపాయం జరుగుతున్నదని ప్రజలకు తెలియజేసి వాటిని వేసూ చెతన్యం కల్పించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆరె రాజు, అధ్యాపకులు, డా.జే.ఓం ప్రకాష్,సుధాకర్, డా.నహీదా, డా.సంతోష్ కుమార్, టి.సురేందర్, జి.కిషన్, రామ్మోహన్ పాల్గొన్నారు.

## వరద ప్రభావిత ప్రజలకు నెస్లే సంస్థ నుంచి నిత్యావసర కిట్ల అందజేత



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** భారీ వర్షాలు,వరదల కారణంగా నష్టపోయిన ప్రజలకు సాయంగా నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను నెస్లే సంస్థ తరపున జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో అందజేశారు.జిల్లాలో వరదల వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు సాయం అందించాలనే ఉద్దేశంతో నెస్లే సంస్థ మొత్తం 600 నిత్యావసర సరుకుల కిట్లను అందజేసిందని కలెక్టర్ తెలిపారు.ఈ కిట్లు వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని కలెక్టర్ అన్నారు.సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన నెస్లే సంస్థ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో నెస్లే సంస్థ మేనేజర్ వసీం అహ్మద్,బోస్కోనెట్ ప్రతినిధి సత్యనారాయణ,ధపాస్ ప్రతినిధులు, పాల్గొన్నారు.

## సోయ కొనుగోలుకు మార్క్‌ఫెడ్ అనుమతి

**ప్రజాపక్షం/నందిపేట్ :** రైతులు ఖరీఫ్‌లో పండించిన సోయాబిన్ పంట కొనుగోలు చేయడానికి డొంకేశ్వర్ సహకార సంఘానికి అనుమతి మార్క్‌ఫెడ్ ఇచ్చింది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. జిల్లాలో సుమారు 30 వేల ఎకరాలలో పంట వేశారు. వాతావరణం మారిన తరువాత కొనుగోళ్ళు జరుగుతాయి.

**దళారులకు అమ్ముకున్నాం... రైతులు**

సోయాబీన్ పంట కోసిన తరువాత అకాల వర్షాల వల్ల తడిసిపోయాయి. మళ్ళీ ఎండ బెట్టి దళారులకు చాలామంది రైతులు అమ్ముకున్నారు. నందిపేట్ మండలంలో ఇదే పరిస్థితి. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చినా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించలేదు. అందుకే రైతులు దళారులను ఆశ్రయించారు.

## ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్‌పి




**ప్రజాపక్షం/బైంసా:** బైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 8 మంది అర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి,ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.ఫిర్యాదుదారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి,బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు.సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**కుటుంబ వివాదాల పరిష్కారంలో షీ టీం పాత్ర..**

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు.కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది.ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా,బైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

**పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష..**

ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి,ఇంకా పెండింగ్ లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

## పాఠశాల అభివృద్ధి కోసం సహకారం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :** భీమ్‌గల్ మండలం పిప్రి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం దుబాయ్ లొద్ది రామన్న ఆలయ కమిటీ సభ్యులు ముందుకు వచ్చారు. కమిటీ సూచన మేరకు ముందుగా సభ్యులు కొందరు పాఠశాలను సందర్శించి అవసరాలను గుర్తించారు. స్టూడెంట్స్ అత్యవసరమైన తాగునీటి సౌకర్యం కోసం వాటర్‌ప్లాంట్ ఏర్పాటు, వాటర్ ట్యాంకుతో పాటు పైపులైన్ నిర్మాణం చేయించారు. పాఠశాలలో కంప్యూటర్ల కోసం ఉన్న వాటిలో చెడిపోయిన బ్యాటరీ ల స్థానంలో కొత్త వాటిని మార్పించారు. తరగతి గదులకు ఉన్న కిటికీ రెక్కలు మార్పించారు. పాఠశాల అభివృద్ధి కోసం దాదాపు ఇప్పటికే సుమారు రూ.180000 కమిటీ ఆధ్వర్యంలో ఖర్చు చేశారు. భవిష్యత్తులో పిల్లల కోసం డెస్క్‌బెంచీలను కొనుగోలు చేసి స్టూడెంట్స్‌కు అందుబాటులోకి తెస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం వాటర్‌ప్లాంట్ ప్రారంభం చేశారు. కార్యక్రమంలో ఉన్నత, ప్రైమరీ హెడ్‌మాస్టర్లు కరుణాకర్, దిలీప్, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న దుబాయ్ రామన్న కమిటీ సభ్యులకు ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## నాణ్యతతో కూడిన పనులు చేపట్టి పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/ములుగు:**వచ్చే సంవత్సరం జనవరి 28 నుండి 31వ తేదీ వరకు జరగనున్న మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన, నాణ్యతతో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కెఎస్ శ్రీనివాసరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఆర్అండ్‌బి ఈఎన్‌సి మోహన్‌నాయక్‌తో కలిసి ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కెఎస్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రాంగణం పనులు, పలుచోట్ల చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. గుత్తేదారులు సమయానికి అన్ని పనులను పూర్తి చేయాలని, ఆయా పనులను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యత లోపించకుండా జాగ్రత్త పడాలని సూచించారు. మేడారం అమ్మవాళ్ళని దర్శించుకోవడానికి వస్తున్న భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా పనులు చేపట్టాలని, ప్రస్తుతం చేస్తున్న పనులు శాశ్వతంగా నిలిచిపోయేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంకటేష్, ఆర్అండ్‌బిఎలక్ట్రిసిటీ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్, ఎండోమెంట్ అధికారులు, పూజారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫీజురీయింబర్సెమెంట్ ఇవ్వకుండా విద్యార్థులను మోసం చేస్తున్న ప్రభుత్వం

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** బిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు పిలుపు మేరకు ఖానాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆదేశానుసారం ఖానాపూర్ బిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించిన హలో విద్యార్థి చలో కలెక్టరేట్ ముట్టడి,ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యాశాఖకు మంత్రి లేకపోవడం వల్ల అనేక సమస్యలు విద్యారంగంలో నెలకొన్నాయి అని విద్యార్థులకు ఫీజురియింబర్స్మెంట్ కాకపోవడం వల్ల పై చదువులకు వెళ్ళడానికి విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ పనులు చేసిన తమ మంత్రులకు బిల్లులు క్లియర్ చేసింది.కానీ విద్యాసంస్థ యాజమాన్యం లకు మాత్ర ఫీజురీయింబర్స్మెంట్ బిల్లులు క్లియర్ చేయలేకపోయారు.అని అన్నారు,పెండింగ్‌లో ఉన్నఫీజు బకాయిలు ప్రభుత్వం విడుదల చేసే వరకు బిఆర్ఎస్వీ తరుపున మా పోరాటం ఆగదు అని నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో నిర్మల్,ముధోల్,ఖానాపూర్ బిఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

## బాల్య వివాహ నిరోధక చట్టంపై అధికారులకు శిక్షణ




**ప్రజాపక్షం/ఎడపల్లి:** బాల్య వివాహాలు చేయడం, ఆ వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని ఐసిపిఎస్ కౌన్సిలర్ జమ్ము, జెండర్ స్పెషలిస్ట్ కవిత లు అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐసిడిఎస్, ఐసిపిఎస్ ల ఆధ్వర్యంలో బాల్య వివాహ నిరోధక చట్టం 2006పై మండల, గ్రామ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం, ఆ వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని అన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బాలికలకు 18సంవత్సరాలు, బాలురకు 21సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. బేటి బచావో, బేటి పడావో, గర్భస్త శిశువు లింగ నిర్ధారణ నిషేద చట్టం, లైంగిక వేధింపులు, గృహహింసలపై అవగాహన కల్పించారు. మహిళా చట్టాలు, ఆపద సమయంలో ఎవరిని సంప్రదించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహ నిరోధక చట్టం 2006 కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ మన్మోహన్ శాస్త్రీ, ఎఎస్ఐ ఇలియాస్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సావిత్రి, వార్డు సంస్థ సిసి రజిత, అంగన్‌వాడి టీచర్స్, పంచాయతీ కార్యదర్శులు, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌టి హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/బోధన్ :** నిజామాబాద్ జిల్లా పరిధిలోని ఎస్టీ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. గిరిజన విద్యార్థి సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు జాదవ ప్రవీణ్ నాయక్ బుధవారం డిటిడిఓ ని కలిసి వినతి పత్రం అందచేశారు. నిజామాబాద్ జిల్లా పరిధిలో గల ఎస్టీ బాల బాలికల వసతి గృహాలలో కనీస అవసరాలు కూడా నోచుకోలేని పరిస్థితిలో ఉన్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఎస్టీ వసతి గృహాలలో కిటికిలకు, దోమతెరలు ఫ్యాన్లు, మరుగుదొడ్ల తలుపులు సరిగా లేనందున విద్యార్థులు అవస్థలు పడుతున్నారని హాస్టళ్లలోని పిల్లలకు మెనూ ప్రకారం భోజన వసతి క్రమం తప్పకుండా కల్పించాలని జిల్లా గిరిజన శాఖ అధికారిని కలిసి వసతి గృహాలలోని సమస్యల గురించి చర్చించారు. వసతి గృహాలను సందర్శించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారి వెంటనే స్పందించి వసతి గృహాలలోని లోటుపాట్లను వెంటనే పర్యవేక్షించి విద్యార్థిని విద్యార్థులకు మంచి భోజనంతో పాటు వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్రా బన్నీ నాయక్ పాల్గొన్నారు.

# రక్తదానంతో కొన్ని ప్రాణాలు కాపాడవచ్చు

పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య




ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు రక్తం కావలసి ఉంటుందని, రక్తదానం చేయడం వల్ల అలాంటి ఎంతోమంది ప్రాణాలను కాపాడిన వారమవుతామని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా (పోలీసు ఫ్లాగ్ డే) పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సిబ్బంది చేసే రక్తదానం అత్యవసర సమయాల్లో ఇతరులకు ప్రాణ దానం అవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఇటువంటి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని రక్తదానం చేసి తోటి వారి ప్రాణాలను కాపాడగలిగిన వారమవుతామని అన్నారు.
రక్తదాన శిబిరంలో దాదాపు 177 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి పోలీసు కమిషనర్ చేతుల మీదుగా హెల్మెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు డిసిపి (ఎ.ఆర్.) రామ్ చందర్‌రావు, నిజామాబాద్ ఏసిపి రాజా వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, పోలీసు యునిట్ ఆఫీసర్ డాక్టర్ సరళ, రిజర్వు ఇన్స్‌పెక్టర్ సతీష్, శ్రీనివాస్, జిల్లా ప్రభుత్వ హాస్పటల్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ ఇమ్రాన్ అలీ, సిఐలు, ఎస్ఐలు, మోక్ష డ్రెసెస్ యాజమాన్యం ప్రవీణ్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషా, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, పోలీసు యూనిట్ హాస్పిటల్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, రక్తదానం చేసిన ప్రజలు హాజరయ్యారు.

## ఆర్ఒబిల పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను కోరిన ఎంపి అరవింద్

సానుకూలంగా స్పందించిన మంత్రి

ప్రజాపక్షం/నిజామాబాద్ : ఆర్ఓబీల పెండింగ్ బిల్లులు మంజూరు చేయండని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను ఎ ంపి అరవింద్ కోరారు. బుధవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా గత కొన్ని నెలలుగా పెండింగ్‌లోని జిల్లాకు చెందిన మాధవ్‌నగర్, ఆర్మూర్ పల్లి, అడవి మామిడిపల్లి ఆర్ఓబీలకు సంబంధించి సుమారు 13.5 కోట్ల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. మంత్రి భట్టి సానుకూలంగా స్పందించి పెండింగ్ బిల్లులను సత్వరమే విడుదలయ్యేలా కృషి చేస్తానని హామీనిచ్చారని, ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

## పండ్లు అమ్మేవారు, కూరగాయలు అమ్మేవారికి అవగాహన

ప్రజాపక్షం/భీమ్‌గల్ : పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న పండ్లు అమ్మేవారు, కూరగాయలు అమ్మేవారికి మున్సిపల్ కమిషనర్ గంగాధర్, ఎస్సై సందీప్ బుధవారం అవగాహన కల్పించారు. తరచుగా బస్టాండ్ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నందున ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తదనంతరం పండ్లు అమ్మేవారిని కూరగాయలు అమ్మేవారిని అనువైన స్థలంలకు మార్చటం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానర్ ఆంజనేయులు, మేనేజర్ నరేందర్, మున్సిపల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొట్టిన తుఫాన్ వాహనం

ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని నాగపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నాగపూర్ నుంచి కమ్మర్‌పల్లి వైపునకు ప్రయాణికులు వస్తున్న ఆటోను మెట్‌పల్లి వైపునకు వెళుతున్న తుఫాన్ వాహనం ఢీకొట్టింది. దీంతో ఆటో నడుపుతున్న డ్రైవర్ ఖాదర్‌కు తీవ్ర గాయాలు కాగా పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

## పోలీసు అమరవీరుల స్మృతిలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాపక్షం/ఆర్మూర్ : పోలీస అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని క్షత్రియ కళ్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో ఆర్మూర్ డివిజన్ నుంచి 180 మంది యువకులు పెద్ద ఎత్తున పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య పాల్గొని మాట్లాడారు. రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుసాతరని అమరవీరుల త్యాగాన్ని గుర్తు చేసుకోవడానికి ఇదోక మంచి అవకాశమని సందర్భంగా తెలిపారు. రక్తదానం శిబిరంలో పాల్గొన్న ప్రతిఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌హెచ్ఓ సత్యనారాయణ, భీమ్‌గల్ సిఐ సత్యనారాయణ, ఎస్సైలు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్‌లో 5 ఎంవిఆర్ పిటిఆర్ ఏర్పాటు

ప్రజాపక్షం/నిజాంసాగర్ : మగ్దూంపూర్, గాలీపూర గిర్నితాండా, దూప్‌సింగ్‌తాండా, కోమలంచ, తుంకిపల్లి, శనివార్‌పేట్ గ్రామాలలో వచ్చే వేసవికాలంలో ఎదురయ్యే ఓవర్‌లోడ్ సమస్యను దృష్టిలో పెట్టుకుని మగ్దూంపూర సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఆర్ పీటీఆర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని విద్యుత్తుశాఖ అధికారులు పేర్కొన్నారు. గతంలో సబ్ స్టేషన్‌లో 3.15 ఎంవీఆర్ పీటీఆర్ ఏర్పాటు చేయగా అధిక లోడ్ సమస్య కారణంగా 5 ఎంవీఆర్ పీటీఆర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కామారెడ్డి ఎస్ఈ శ్రావణ్ చేతుల మీదుగా దానిని చార్జి చేయడం జరిగింది. దీని వలన గ్రామాలలో విద్యుత్తు వినియోగదారులకు ఎంతో మేలు జరుగుతుందని ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఎస్‌బీఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన విద్యాధికారి

ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ : మండలంలోని బడాభీమ్‌గల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల విద్యాధికారి స్వామి సందర్శించారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహణను పరిశీలించి అనంతరం మధ్యాహ్న భోజన పనితీరును పరిశీలించారు. వంటగదిని ఎప్పటికప్పుడు ఉంచుకోవాలని తగు సూచనలు చేశారు. విద్యాధికారితో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## మండలంలో అక్రమ ఇసుక, మొరం తవ్వకాలకు చెక్

ప్రజాపక్షం/మాక్లూర్ : మండలంలో అనుమతులు లేకుండా ఇసుక, మొరం రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శేఖర్ తెలిపారు. బుధవారం మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం వల్లభాపూర్ వాగు నుండి అనుమతులు ఇచ్చారు. అక్రమంగా ట్రాక్టర్ డ్రైవర్లు అధికారులకు తెలియకుండా అనుమతి లేని చోట ఇసుక పోయడానికి ప్రయత్నించటంతో తహసీల్దార్ శేఖర్ పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తలరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే విధులు నిర్వహించటంతో సామాన్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## టీచర్ ఆయా ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోండి

ప్రజాపక్షం / నందిపేట్ : నందిపేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రీ ప్రయిమరీ పాఠశాలగా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఎంఈవో గంగాధర్ తెలిపారు. ఈ పాఠశాలలో పిల్లలకు పాఠాలు చెప్పడానికి టీచర్, ఒక ఆయా కావాలని దరఖాస్తులు కోరుతున్నారు. టీచర్ కొరకు ఇంటర్ నుంచి బిఈడి చేసినవారు, నెల జీతం రూ. 8500 ఉంటుందని, ఆయా ఏడు నుంచి పదవ తరగతి చదువుకున్న వారు దరఖాస్తులు ఈనెల 31 లోగా నందిపేట్ స్కూల్లో అందజేయాలని సూచించారు.

## అత్యాచార నిందితుడు అబ్దుల్ లతీఫ్‌కు పది సంవత్సరాల జైలు

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : హిందువుగా మారతానని నమ్మించి అత్యాచారం చేసిన మహమ్మద్ అబ్దుల్ లతీఫ్‌కు పది సంవత్సరాల కఠిన జైలు శిక్ష, మోసం చేసినందున మరో సంవత్సరం సాధారణ జైలుశిక్ష విధిస్తు, నిజామాబాద్ మహిళలపై అత్యాచారాల విచారణ న్యాయస్థానం స్పెషల్ జడ్జి హరీష తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే బుధవారం నిజామాబాద్ నగర పోలీసు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయం కోర్టుకు సమర్పించిన అభియోగ పత్రం ఆధారంగా నేర న్యాయ విచారణలో భాగంగా మొత్తం పదమూడు మంది సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసుకుని, అన్నింటిని అధ్యయనం చేసిన పిదప నేరారోపితుడు అయిన మహమ్మద్ అబ్దుల్ లతీఫ్‌పై మహిళను మోసం చేసి, పదే పదే ఆమెపై అత్యాచారం చేసిన నేరారోపణలు రుజువు అయినట్లు నిర్ధారించింది.
ఒక హిందూమహిళను ప్రేమిస్తున్నానని నమ్మించి హిందువుగా మారి పెళ్లి చేసుకుంటానని ఆమెను లొంగదీసుకుని పలుమార్లు అత్యాచారం చేశాడు.
మాయమాటలు చెప్పి మోసం చేశాడు. భారత శిక్షాస్మృతి ప్రకారం సెక్షన్ 417 (మోసం చేయడం) ప్రకారం ఒక సంవత్సరం సాధారణ జైలుశిక్షతో పాటు ఐదువేల రూపాయల జరిమానా, జరిమానా చెల్లించని యెడల అదనంగా మూడు నెలల జైలుశిక్ష, సెక్షన్ 376 (2) (ఎన్) అత్యాచారం చేసిన నేరానికి గాను పది సంవత్సరాల కఠిన జైలు శిక్షతో పాటు పదివేల రూపాయల జరిమానా, జరిమానా చెల్లించని యెడల అదనంగా ఆరునెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని అదనపు సెషన్స్ హరీష తమ తీర్పును 43 పేజీలలో పేర్కొన్నారు. పోలీసుల తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. ఇట్టి తీర్పు పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## క్యాన్సర్, టొబాకో పై విద్యార్థులకు అవగాహన సదస్సు



ప్రజాపక్షం / నందిపేట్ : నందిపేట్ మండలంలో అయిలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు రొమ్ము క్యాన్సర్ వల్ల కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రవీణ్ అవగాహన కల్పించారు. అలాగే టొబాకో మనుషుల ఆరోగ్యం దెబ్బతీస్తుందని, యువత సిగరెట్లు పట్టడం, టొబాకో నమలడం వంటివి చేయవద్దని వారి ఆరోగ్యం రోజురోజుకు దిగజారుతుందని ప్రాణాంతకంగా మారుతుందన్నారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయని దీనిని విద్యార్థులు గుర్తించాలని ప్రచారం చేయాలని డాక్టర్ సూచించారు. ఈ సదస్సులో ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బోధన్ పట్టణ అభివృద్ధికి 18కోట్ల 7లక్షల నిధులు



ప్రజాపక్షం/బోధన్ : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కొరకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ కట్టుబడి ఉన్నారని అందుకొరకు కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధి కొరకు 200కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారని, పట్టణాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సహకారంతో బోధన్ పట్టణానికి 18.7కోట్ల నిధులు మంజూరైనట్లు బిజెపి బోధన్ పట్టణ అధ్యక్షుడు గోపి కిషన్ తెలిపారు. బుధవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రధానమంత్రి మోడీ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గోపి కిషన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద ప్రజల కోసం దేశం మొత్తం ఉచిత రేషన్ బియ్యం అందిస్తున్న ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకే దక్కుతుందన్నారు. చిన్న వ్యాపారుల కొరకు ముద్రలోన్ తో సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వినోద్, కిసాన్ మోర్చా అధ్యక్షులు ఏశాల సూరి, కార్యదర్శి దేవకట్ట శివ, కోశాధికారి పప్పుల వేణు, వెంకటేష్, స్వప్నిల్, చరణ్, భూమన్న, రాజు, శీను, కిరణ్, కళ్యాణ్, ప్రవీణ్, శివ, చిన్న, అనిల్, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

